

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**అమెరికాలో** న్యూ ఇయర్ జరుపుకోవడం ఇదే మొదటిసారి కావడంతో చాలా సంబరంగా అనిపించింది. తల స్నానం చేసి జుట్టుకి ఒక చిన్న క్లిప్ పెట్టాను. అలానే ఓ మంచి షర్ట్, జీన్స్ వేసుకున్నాను. బయట స్నో కూడా ఇవాళ ఆహ్లాదంగా అనిపించింది.

"ఒసేయ్. ఇలానే వస్తావా?" అన్నయ్య అడిగాడు.

"ఏ? బాలేదా?"

"ఆ జుట్టుది తీసెయ్ ముందు."

"ఏ? క్యూట్‌గా లేదా?"

"నువ్వేమన్నా స్కూల్ పిల్లవా తల్లో టెడ్డీబేర్ క్లిప్ పెట్టుకోడానికి? ఏదైనా మంచి చౌక్కా కానీ డ్రస్ కానీ వేసుకో. ఇది ఎల్లుండి ఫ్లైట్‌లో వేసుకో."

"ఫ్లైట్‌లోనా? నేను పార్టీవేర్ అనుకున్నా."

నా మొహం చూసి నవ్వాడు. అదృష్టవసాత్తు ఓ తళుకులు, బెళుకులు ఉన్న షర్ట్ తెచ్చాను. " చమ్కీ చమ్కీ షర్ట్ వుంది. అది వేసుకుంటా" అన్నాను.

"మనం జాతరకి వెళ్ళట్లేదు" ఆశ్చర్యపోయాడు.

నేను బుంగమూతి పెట్టడంతో "వేసుకుని చూపించు" అన్నాడు.

అలానే చేసాను. "ఇది నేను కొనిచ్చిందే కదా?" అడిగాడు.

తలూపాను.

"మరి చమ్కీ చమ్కీ అన్నావేంటి? ఇది జస్ట్ కొంచెం షైనీ అంతే."

"ఛ. ఆ షైనీనే తెలుగులో చమ్కీ అంటారు" నవ్వుతూ ఇద్దరం ఇంట్లోంచి బయలుదేరాము.

ఆరోజు వెళ్ళిన రాంచ్ హౌస్ వాళ్ళ ఇంటికే వెళ్ళాము. మేము వెళ్ళేసరికి ఎనిమిది దాటింది. అప్పటికే చాలామంది వచ్చేసారు.

"ఆల్రెడీ వచ్చేసారా?" అడిగాను.

"మనమే లేట్" అన్నాడు.

"అదేంటి? న్యూ ఇయర్ పన్నెండింటికి కదా?"

"పదకొండుకి వచ్చి పన్నెండుకి వెళ్ళిపోవాలా?" ఇంతలో అన్నయ్య ఫ్రెండ్స్ పలకరించారు. ఇప్పటివరకు కలిసిన వారిని గుర్తుపట్టి బానే మాట్లాడాను. నన్ను పొడుగు జుట్టులో చూసిన ఒకరు మాత్రం నన్ను అసలు గుర్తుపట్టలేకపోయారట. కొద్దిసేపు వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకోవడంతో నాకు కాస్త బోర్ కొట్టింది.

ఇంతలో ఎవరో వచ్చి "ఆర్ యు ఆల్సో వెజిటేరియన్?" అడిగారు.

తలూపాను.

టేబుల్ మీద వెజ్ వన్నీ చూపించి "హెల్ప్ యువర్ సెల్ఫ్" అని వెళ్ళిపోయింది. అవి చూసి ఆకలి మొదలైంది. అన్నయ్య వైపు చూసాను కానీ మాటల్లో మునిగిపోయాడు. కాసేపు ఆగి సరే అని టేబుల్ మీద ఉన్న బ్రెడ్ తీసుకుని చిన్న ముక్క చేసాను.

"ట్రై ఇట్ విత్ దిస్ చీజ్. ఇట్స్ అమేజింగ్" అని ఒకరు అన్నారు.

సరే అని తిన్నాను. నిజంగానే అద్భుతంగా ఉంది. ఎక్కువ తింటే బావుండదని ఊరుకున్నాను.

అన్నయ్య నా దగ్గరకొచ్చి "బోర్ కొడుతుందా?" అడిగాడు. లేదని చెప్పాను. నాలా మొహమాట పడకుండా అన్నయ్య టేబుల్ మీదవి అన్నీ రుచి చూసి కొన్ని ప్లేటులో పెట్టుకున్నాడు. నేను ఆశ్చర్యపోవడం గమనించి "ఇవ్వన్నీ వెజ్. మనకోసమే తెచ్చారు. నువ్వు, నేను తప్ప అందరూ నాన్ వెజిటేరియన్స్" అన్నాడు.

నేను కూడా ప్లేట్ తీసుకుని దాని నిండా రకరకాల వెరైటీలు తీసుకుని తినడం మొదలు పెట్టాను. ఇంతలో మరెవరో వచ్చి హెల్ప్ కావాలన్నారు. ఇంకెవరో 'సరే ' అని వెళ్ళారు. చాల హడావిడి హడావిడిగా ఉండటంతో అన్నయ్య బయటకి వెళ్దాం అన్నాడు. చల్లగా ఉంటుందని భయపడ్డాను కానీ బయట హీటర్ పెట్టారు. దాంతో వెచ్చగా బావుంది. మేము వెళ్ళేసరికే కొంతమంది అక్కడ ఉన్నారు. మాటల్లో తెలీకుండానే సమయం గడిచిపోయింది.

ఒకావిడ వచ్చి దారంతో చేసిన బ్రేస్‌లెట్ చూపించి కావాలా అని అడిగింది.

వద్దు అన్నాను.

'అర్ యు షూర్?' అని ఆశ్చర్యపోయింది.

'సరే' అని తీసుకున్నాను.

ఇట్స్ గుడ్‌లక్ అని అన్నయ్య చేతికి కూడా కట్టింది.

"తను ఇటాలియన్. వాళ్ళ సాంపదాయం ప్రకారం న్యూ ఇయర్‌కి ఎరుపు వేసుకుంటే గుడ్ లక్. అందుకే అందరికీ బ్రేస్‌లెట్ ఇస్తుంది" అన్నాడు.

చూస్తూ చూస్తూ దాదాపు పన్నెండు దగ్గర పడింది. కిచెన్‌లో హడావిడి చేసిన ఆవిడ కొన్ని పుల్లలకి ద్రాక్ష పళ్ళు గుచ్చి ట్రేలో పెట్టి తెచ్చింది. అందరికీ పంచి ఇంకెవరైనా మిగిలిపోయారా అని అడిగింది. అందరిలో కాస్త చూడ్డానికి చిన్నగా ఉన్న వాళ్ళు నన్ను లోపలికి రమ్మన్నారు. అందరూ టేబుల్ కిందకి దూరారు. అర్థంకాక అలానే నిలబడ్డాను. రమ్మన్నట్టు సైగ చేసిన అమ్మాయి పక్కకి వెళ్ళాను. పన్నెండు అయ్యాక ప్రతీ సెకండుకి ఒక ద్రాక్ష తింటే గుడ్‌లక్ అని చెప్పింది. మరీ టేబుల్ కింద దూరడం కూడా గుడ్ లక్కా అని తెగ ఆశ్చర్యపోయాను.

పన్నెండు కాగానే అంతా గబగబా ద్రాక్షలు ఒకదాని తరవాత ఒకటి తిని టైం చూసాను. ఇంకా పన్నెండనే ఉండడంతో గుడ్ లక్ వస్తుందని ఎంతో ఆనందించి అంతా తెగ నవ్వాము. ఈలోపు కొంతమంది షాంపేన్ తెరిచి హాపీ న్యూ ఇయర్ అని అరిచారు. అన్నయ్య తాగుతున్నాడా అని గమనించాను. గ్లాసు తీసుకున్నాడు కానీ తాగకుండానే పక్కన పెట్టేసాడు. అమ్మకి ఫోన్ చెయ్యాల్సిన అవసరం లేదు.

"అవని, యువర్ బ్రదర్ ఈజ్ కాలింగ్ యు" ఎవరో అనడంతో అన్నయ్య దగ్గరకి వెళ్ళాను.

"ఈ సంవత్సరం ఎన్ని ఊళ్ళకి వెళ్దామనుకుంటున్నావు?"

"ఏమో? ఎన్ని కుదిరితే అన్ని."

"సరే ఈ సూట్ కేస్ పట్టుకునిరా."

"అదేంటి?"

"వీళ్ళ సాంప్రదాయం ప్రకారం న్యూ ఇయర్ అప్పుడు ఒక సూట్‌కేస్ పట్టుకుని ఇంటి చుట్టుపక్కల రోడ్ల మీద ఒక రౌండ్ నడిస్తే ఎక్కువ ట్రావెల్ చేస్తారని వాళ్ళ నమ్మకం"

ఇద్దరం కలిసి మరో ఆరుగురితో బయట చేరి ఖాళీ సూట్‌కేస్‌లతో ఇంటి చుట్టూ తిరిగాము. ఇంటికి వెళ్ళేసరికి ఫైర్ వర్క్స్ ఇంకా కనబడుతున్నాయి. అప్పుడే ఒకావిడ వచ్చి "వాట్ ఈజ్ ఇండియన్ ట్రెడిషన్" అని అడిగింది.

అన్నయ్య ఏదో అనబోగా "వాచింగ్ ఫైర్ వర్క్స్" అన్నాను.

దాంతో అందరూ ఆకాశంలో రాకెట్లని చూడసాగారు. అన్నయ్య నన్ను చూసి నవ్వాడు. అన్నయ్య పక్కన నుంచుని అలా న్యూ ఇయర్ జరుపుకుని కనీసం నాలుగేళ్ళవుతుంది. ఎందుకో తెలియకుండా సంతోషం కలిగింది. అన్నయ్యని ఆనుకుని ఆకాశంలో రాకెట్లు చూడసాగాను.

"బానే ఉన్నావా? బోర్ కొడుతుందా?" అడిగాడు.

"బానే ఉంది. బోర్ లేదు" బదులిచ్చాను.

"హ్యాపీ న్యూ ఇయర్" అన్నాను.

అన్నయ్య నవ్వి "హ్యాపీ న్యూ ఇయర్" అన్నాడు.

అక్కడ సాంప్రదాయం మేము పాటించింది చైనీస్ వారిది. వారి సాంప్రదాయం ప్రకారం తలమీదగా బియ్యాన్ని విసిరేసి తిరిగి చూడకపోవడం గుడ్‌లక్. నేను, అన్నయ్య అందుకు ఇష్టపడలేదు. మమ్మల్ని మినహాయించి అందరూ బియ్యాన్ని విసిరేసారు. మేము బయలుదేరేసరికి ఇల్లంతా చాలావరకు బియ్యం మయం అయింది. నేను, అన్నయ్య వాళ్ళు ఇల్లు క్లీన్ చెయ్యడానికి ఎంతసేపు పడుతుందో అని వాపోయాము. అలానే అంత బియ్యం దండగ అవ్వడంతో కాస్త బాధపడ్డాము.

ఇంటికి వెళ్ళిన మరుక్షణం నేను నిద్రపోయాను.

"గుడ్ మార్నింగ్" అన్నయ్య తలుపు బయటనుంచి అరవడంతో లేచి నేనుకూడా గుడ్ మార్నింగ్ అని అరిచాను.

"అమ్మ. ఫోన్ మాట్లాడతావా?" అడిగాడు.

తలుపు తెరిచి ఫోన్ తీసుకున్నాను. అమ్మతో మాట్లాడుతూనే పళ్ళు తోముకుని బయటకి వచ్చాను. రాత్రి విషయాలన్నీ ఉత్సాహంగా పంచుకున్నాను.

"నువ్వు కాబట్టి అన్నీ చెపుతున్నావు. అన్నయ్య ఏమీ చెప్పడు నాకు" అంది.

"అదేంటి? ఇన్ని జరిగితే ఏమీ చెప్పలేదా?"

"లేదు. అంతా మామూలుగానే ఉంది అన్నాడు."

"అన్నయ్యకి ఇది మామూలేమో?"

"రోజూ న్యూ ఇయర్ జరుగుతుందా ఏంటి? ఇదేం మామూలు? నాతో పంచుకోవటం రాదో పాడో."

"కాదులే. నాతో కూడా ఎక్కువ ఏం మాట్లాడడు."

"రేపు పెళ్ళయ్యాక ఎలా ఉంటాడో ఏంటో? అమ్మాయ్ కాస్త నాతో సఖ్యంగా ఉంటే బావుండు."

"బానే ఉంటుందిలే. ఎందుకు ఉండదు?"

"ఏమో కలి కాలం. మన చేతుల్లో ఏముంది .అంతా దేవుడి దయ"

అన్నయ్య పిలవడంతో ఫోన్ పెట్టి లంచ్‌కి బయటకి వెళ్ళడానికి తయారయ్యాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story